ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM
# నేటి దర్శిని
RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...
రంగారెడ్డి గురువారం 3-09-2026 సంపుటి: 02 సంచిక : 124 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని
Ranga Reddy Thursday, 3-09-2026 Volume :02 Issue: 124 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింద నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777



## కేసీఆర్ రాజీనామా చేస్తే సోనియానే వణికింది..

**నీకు తట్టుకునే దమ్ముందా? రేవంత్‌పై కేటీఆర్ ఫైర్**

- కేసీఆర్ రాజీనామాలతోనే తెలంగాణ సాధ్యమైందన్న కేటీఆర్
- రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికిందని వ్యాఖ్య
- సోనియా గాంధీ తట్టుకోలేక తెలంగాణ ఇచ్చారంటూ విమర్శ
- కేసీఆర్ రాజీనామాపై రేవంత్ పదేపదే మాట్లాడటంపై ఆగ్రహం
- "నీ నుంచి అయితదా రేవంత్?" అంటూ కేటీఆర్ సూటి ప్రశ్న
- పనికిమాలిన మాటలు మాని.. పనికొచ్చే పని చేయాలని హితవు

హైదరాబాద్

ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజీనామాలు కొత్త కాదు. ఆయన రాజీనామా చేస్తేనే ఢిల్లీనే దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందని కేటీఆర్ అన్నారు. బుధవారం మాజీ మంత్రి హరీశ్ రావుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి 1000 రోజుల దగా పాలనపై తెలంగాణ భవన్‌లో 'ఛార్జ్ షీట్'ను విడుదల అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాటిమాటికి రేవంత్ రెడ్డి కేసీఆర్ రాజీనామా చేయాలని అసందర్భంగా మాట్లాడుతున్నాడు.కేసీఆర్ రాజీనామా చేస్తే ఢిల్లీ గడగడా వణికింది. వీపు పగులతదని అర్థమై తప్పని సరి పరిస్థితుల్లో చివరికి మీ నాయకురాలు సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది. కేసీఆర్ రాజీనామా

-మిగతా 2 లో



02

## రామ మందిరం తొలి సీఈవోగా జితేంద్ర మిశ్రా

**ఆపరేషన్ సిందూర్‌లో వెస్ట్రన్ ఎయిర్ కమాండ్ చీఫ్‌గా సేవలు**

- జితేంద్ర మిశ్రా నియామకానికి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆమోదం
- ఎయిర్ మార్షల్‌కు కీలక బాధ్యతలు
- విరాళాల చోరీ ఆరోపణల నేపథ్యంలో ట్రస్ట్ సమావేశం
- ముగ్గురు కొత్త ట్రస్టీల నియామకం
- మహేష్ భాగ్‌చంద్కా, మదన్ మోహన్ పాండే, నిర్మలా యాదవ్‌కు చోటు
- రామ మందిర నిర్వహణలో సీఈవోది కీలక పాత్ర
- దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గర్వంగా ఉందన్న జితేంద్ర మిశ్రా

# బీసీ మహిళ కాబట్టే కుట్రలు

**అందుకే టార్గెట్ చేశారు**

- అన్ని విషయాలు ఖర్గేకు వివరించా
- నా కూతురు వ్యాఖ్యలకు నన్ను బాధ్యురాలిని చేయొద్దు
- నాపై మాట్లాడిన నేతలకూ నోటీసులు ఇవ్వాలని కోరా
- పదవిలో కొనసాగించాలని ఖర్గేను అడిగాను
- మీడియాతో మంత్రి కొండా సురేఖ వెల్లడి



న్యూఢిల్లీ,

బీసీ మహిళను కాబట్టే తనను టార్గెట్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కూతురు చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయడం సరికాదన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో తనపై కొనసాగుతున్న వివాదానికి తెరదించుకునేందుకు మంత్రి కొండా సురేఖ ఢిల్లీ వేదికగా తన వాదనను హైకమాండ్ ముందు బలంగా వినిపించినట్లు వెల్లడించారు. సమావేశం అనంతరం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం మధ్యాహ్నం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తనకు ఇచ్చిన షోకాజ్ నోటీసు, తనపై వచ్చిన ఫిర్యాదులు, తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై తనను బాధ్యురాలిని చేస్తున్నారని, వాటిపై వివరణ ఇచ్చానన్నారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్

-మిగతా 2 లో

# మళ్లీ వార్ సెగలు



02

- భగ్గుమన్న పశ్చిమాసియా
- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు
- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..
- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్
- హార్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?
- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్

# వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తాం

**ప్రాణహిత--చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి**


- తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రకటన
- వైఎస్సార్ చివరి కోరికను నెరవేర్చేందుకు కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపు
- రైతుల కోసం వైఎస్సార్ చేసిన సేవలను గుర్తుచేసుకున్న సీఎం
- రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం వైఎస్సార్‌దేనని వెల్లడి
- రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలు రద్దు చేసిన మహానేత
- వైఎస్సార్ అవార్డు--2026 ప్రదానం
- ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు అవార్డు
- ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఘనంగా కార్యక్రమం


న్యూఢిల్లీ:

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయమైన ప్రాణహిత--చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులను పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో డాక్టర్ వైఎస్సార్--డాక్టర్ కేవీపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అవార్డు--2026 ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. భారతీయ వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిర అభివృద్ధి, గ్రామీణ జీవనోపాధి రంగాల్లో విశేష కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు

-మిగతా 2 లో





02

## 4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం

- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్
- ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో
- జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం
- సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం
- జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05
- భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ
- ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్



02

## ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..

- రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు
- 10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్
- కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత
- మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం
- సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో
- భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పొదుపు వినియోగం



## కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

- "కాంగ్రెస్‌లో కొత్తవాళ్ల పెత్తనాన్ని సహించబోను"
- కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగదని వ్యాఖ్య
- వైఎస్సార్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని వెల్లడి
- 'సీఎం.. సీఎం' అంటూ కార్యకర్తల నినాదాలపై కీలక వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి:

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన కొందరు కాంగ్రెస్‌ను కబ్జా చేసి అధికారం చెలాయించాలని చూస్తున్నారని ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను తాను చూస్తూ ఊరుకోబోనని హెచ్చరించారు. తెలంగాణలో వైఎస్ రాజశేఖర్ రెడ్డికి లక్షలాది మంది అభిమానులు ఉన్నారని రాజ్‌గోపాల్ రెడ్డి అన్నారు. తాము వైఎస్సార్ నిజమైన శిష్యులమని పేర్కొన్నారు.

-మిగతా 2 లో

# దానం కాదు.. పరిహారం కావాలి




02

- భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు
- కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి
- ఇటీవలి వరదలకు కారణమయ్యాయి
- ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి
- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్
- ఐరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం
- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య
- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు

# వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తాం

మొదటి తరువాయి



ఈ అవార్డును అందజేశారు. బతికున్నంతకాలం రైతుల సంక్షేమం కోసం పరితపించిన డాక్టర్ వైఎస్సార్‌ను గుర్తుచేసుకునేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులను సీఎం అభినందించారు. నిరుపేదలు, రైతుల కష్టాలను తెలుసుకునేందుకు 2003లో మండుటెండలో డాక్టర్ వైఎస్సార్ చేపట్టిన ప్రజాప్రస్థానం పాదయాత్రను ఆయన గుర్తుచేశారు. రైతుల ఆత్మగౌరవాన్ని పెంచేందుకు ఉచిత విద్యుత్ అందించాలని వైఎస్సార్ నిర్ణయించారని తెలిపారు.అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అని సీఎం పేర్కొన్నారు. రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. ఈ నిర్ణయాలతో వైఎస్సార్ రైతుల గుండెల్లో రారాజుగా నిలిచిపోయారని పేర్కొన్నారు. వైఎస్సార్ చివరి కోరికలను నెరవేర్చేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ నిరుపేదలకు కనీస ఆహార భద్రత కల్పించాలనే సంకల్పంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ప్రజా పంపిణీ వ్యవస్థను తీసుకొచ్చారని రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదలకు బియ్యం, గోధుమలు, ఇతర నిత్యావసర వస్తువులను అందించే విధంగా ప్రారంభమైన పీడీఎస్ వ్యవస్థ వల్లే నేడు తెలంగాణలో పెద్ద ఎత్తున ఆహార భద్రత కార్యక్రమాలను అమలు చేయగలుగుతున్నామని వివరించారు. తెలంగాణలో ప్రస్తుతం 3.40 కోట్ల మందికి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, ఎంపీ జైరాం రమేష్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌గౌడ్, కేవీపీ ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీపీ రామచందర్‌రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఊబర్‌లో 3,300 ఉద్యోగాల కోత..

**-రోబోటాక్సీల పోటీ నేపథ్యంలో భారీగా సిబ్బంది తగ్గింపు**
**-10 శాతం ఉద్యోగులను తొలగించనున్న ఊబర్**
**-కొవిడ్ తర్వాత ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత**
**-మేనేజ్‌మెంట్ స్థాయిలను సరళీకరించేందుకు నిర్ణయం**
**-సంస్థాగత సంక్లిష్టతను తగ్గించడమే లక్ష్యమన్న సీఈవో**
**-భవిష్యత్ వృద్ధి, ఆవిష్కరణలకు పొదుపు వినియోగం**




**న్యూఢిల్లీ**

రైడ్ హైలింగ్ వ్యాపారంలోకి రోబోటాక్సీల ప్రవేశాన్ని ఎదుర్కొనేందుకు, కొవిడ్–19 మహమ్మారి తర్వాత తన అతి పెద్ద కోతలలో భాగంగా ఊబర్ టెక్నాలజీస్ దాదాపు 3,300 మంది ఉద్యోగులను అంటే 10 శాతం సిబ్బందిని తొలగించనుంది. ఈ కోతల ద్వారా మేనేజ్‌మెంట్ స్థాయిలు సులభతరం అవుతాయని, వేగవంతమైన వృద్ధి సమయంలో నిర్ణయాలు తీసుకోవడంలో సంస్థాగత సంక్లిష్టతను తగ్గిస్తాయని సంస్థ సీఈవో ఖోస్రాషాహి బుధవారం ఉద్యోగులకు రాసిన నోట్‌లో తెలిపారు. కాగా పలు టెక్ ఎగ్జిక్యూటివ్‌ల మాదిరిగా ఖోస్రాషాహి ఈ ఉద్యోగ కోతలకు ఏఐ కారణమని చెప్పలేదు. ఈ నిర్ణయం భవిష్యత్తులో కీలక వృద్ధికి, నూతన ఆవిష్కరణలకు, తిరిగి పెట్టుబడులు పెట్టడానికి అవసరమయ్యే పొదుపును సృష్టిస్తుందని అన్నారు. అమెరికాలో అదిపెద్ద రోబో టాక్సీ ఆపరేటర్ వేమోతో ఉబర్‌కు పోటీ పెరుగుతున్నందున ఉబర్ ఈ నిర్ణయం తీసుకున్నదనే వార్త వినిపిస్తోంది.

## కాంగ్రెస్‌ను కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారు

మొదటి తరువాయి

వైఎస్సార్ స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. రాజకీయాల్లో ఉన్నంత కాలం ఆయన ఆశయాల సాధన కోసం పనిచేస్తానని, వైఎస్సార్‌ను ఎప్పటికీ మరచిపోబోనని అన్నారు. ఎంతమంది కుట్రలు చేసినా, బెదిరింపులకు పాల్పడినా తాను భయపడేది లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకున్న నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున 'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు చేశారు. దీనిపై స్పందించిన రాజ్‌గోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 'నన్ను సీఎం.. సీఎం అని పిలుస్తున్నారు. ఆ సమయం గనక వస్తే.. దాన్ని బ్రహ్మదేవుడు కూడా ఆపలేడు' అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చి 'రాజన్న రాజ్యం' కొనసాగిస్తామని రాజ్‌గోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## కేసీఆర్ రాజీనామా చేస్తే సోనియానే వణికింది..

మొదటి తరువాయి




చేస్తే సోనియా గాంధీనే తట్టుకోలేకపోయింది. నీ నుంచి అయితదా రేవంత్ అని సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ రాజీనామాతోనే రాష్ట్రం వచ్చింది. పనికి మాలిన మాటలు మాటలు మాని పనికొచ్చే పని చేయాలని హితవు పలికారు

# దానం కాదు.. పరిహారం కావాలి

**-భారత్, చైనా, అమెరికాతో మాకు ముప్పు**
**-కాలుష్యాన్ని విపరీతంగా వెదజల్లుతున్నాయి**
**-ఇటీవలి వరదలకు కారణమయ్యాయి**
**-ఆ మూడు దేశాలు నష్ట పరిహారం చెల్లించాలి**
**- నేపాల్ విదేశాంగ మంత్రి డిమాండ్**
**- ఐరాసను ఆశ్రయించే దిశగా నేపాల్ పీఎం**
**- 1,127కు చేరుకున్న మృతుల సంఖ్య**
**- మూడు నదుల ఉగ్రరూపంతో వరద ముప్పు**




ఖాట్మండ్:

వరద నష్టాలకు పరిహారం చెల్లించాలని చైనా, అమెరికా, భారత్ దేశాలను నేపాల్ డిమాండ్ చేసింది. ప్రపంచంలో పెద్ద మొత్తంలో కాలుష్యాన్ని వెదజల్లే దేశాల్లో ఆ మూడు దేశాలు ముందు వరుసలో నిలిచాయని ఆరోపించింది. భోట్కోసీ నదీ ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న ప్రాణాంతక వరదలకు వాతావరణ నష్టపరిహారం కోరింది. ఈ వరదల్లో కనీసం 1,127 మంది మరణించారు. వేలాదిమంది గల్లంతయ్యారు. నేపాల్–చైనా సరిహద్దు దగ్గర భారీ రాత్రి, మంచు కొండచరియలు విరిగిపడటంతో వరదలు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. మూడు నదుల్లో నీటి మట్టం ప్రమాదకర స్థాయిని దాటడంతో నేపాల్‌కు వరదముప్పు పొంచి ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో నష్టపరిహారం రాబట్టే విషయంలో ఖాట్మండు గట్టి పట్టుదలతో ఉందని వెల్లడించాయి. నష్టపరిహారం కోసం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశానికి ప్రధానమంత్రి బలేంద్ర బాలెన్ షా వెళ్లే అవకాశం ఉంది. ఆయన వ్యక్తిగతంగా రసువా వరదలను హైలైట్ చేసి వాతావరణ న్యాయం, నష్టపరిహారం కోరే ప్రతిపాదన ప్రస్తుతం చర్చలో ఉంది. నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖానాల్ ప్రకారం దేశం సహాయం నుంచి న్యాయం, నష్టపరిహారం వైపు దౌత్య విధానాన్ని మార్చుకుంటోంది. ఇది దానం కాదు, చట్టపరమైన, నైతిక బాధ్యత. ప్రపంచంలో అత్యధిక ఉద్గారాలు విడుదల చేసే దేశాల్లో చైనా మొదటి స్థానంలో, అమెరికా రెండో స్థానంలో, భారత్ మూడో స్థానంలో ఉన్నాయి. నేపాల్ లాంటి హాని కలిగే దేశాలకు నష్టపరిహారం ఇవ్వాల్సిన చారిత్రక బాధ్యత ఈ దేశాలకు ఉందని శిశిర్ ఖానాల్ అన్నారు. ఐక్యరాజ్యసమితి నష్టం, నష్టపరిహార నిధిని కూడా నేపాల్ ఆశ్రయించింది. పునర్నిర్మాణానికి నాలుగు నుంచి ఐదు బిలియన్ డాలర్లు అవసరమవుతాయని అంచనా. సకాలంలో సహాయం పంపినందుకు భారత్, చైనా దేశాలకు ప్రధానమంత్రి బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. అయినప్పటికీ వాతావరణ నష్టపరిహారం కోసం అంతర్జాతీయ వేదికలపై పట్టుదలతో వాదిస్తామని విదేశాంగ మంత్రి శిశిర్ ఖానాల్ స్పష్టం చేశారు. హిమాలయ హిమానీనదాలు కరిగిపోతే గంగ, త్రిశూలి వంటి నదులపై ఆధారపడిన 200 కోట్లకు పైగా దక్షిణాసియా ప్రజల నీటి భద్రత శాశ్వతంగా దెబ్బతింటుందని హెచ్చరించారు.

# మళ్లీ వార్ సెగలు

**- భగ్గుమన్న పశ్చిమాసియా**
**- టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై అమెరికా దాడులు**
**- ప్రతీకారేచ్ఛతో రగిలిన ఇరాన్..**
**- జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్‌లోని యూఎస్ లక్ష్యాలపై ఎటాక్**
**-హార్ముజ్‌ను ట్రంప్ జలసంధిగా మార్చాలా?**
**- ప్రజల్ని ప్రశ్నిస్తూ ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్**



వాషింగ్టన్

పశ్చిమాసియా మళ్లీ భగ్గుమంది. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. మొన్నటి వరకు తగ్గుముఖం పట్టిన ఘర్షణలు మళ్లీ ఉధృతమయ్యాయి. ఇరాన్‌లోని ఇస్లామిక్ రివాల్యూషనరీ గార్డ్ కోర్ప్స్ స్థావరాలు, వైమానిక రక్షణ వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, కమ్యూనికేషన్ మౌలిక వసతులు, సముద్ర సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా సేనలు భారీ దాడులు జరిపింది. కాగా, ప్రతిగా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో అమెరికా సైనిక లక్ష్యాలపైకి విరుచుకుపడింది. జోర్డాన్, బహ్రెయిన్, ఇరాక్, కువైట్ ప్రాంతాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, అమెరికా ప్రయోజనాలకు సంబంధించిన ప్రాంతాలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 11 మంది మృతిచెందినట్లు సమాచారం. ఈ దాడులు జులై తర్వాత ఇరుదేశాల మధ్య జరిగిన అత్యంత తీవ్రమైన ప్రత్యక్ష సైనిక ఘర్షణగా మారాయి. ప్రస్తుత ఘర్షణకు హార్ముజ్ జలసంధి కీలక కేంద్రంగా మారింది. ప్రపంచ చమురు రవాణాలో అత్యంత వ్యూహాత్మకమైన ఈ మార్గంలో ఇరాన్ మైన్లను ఏర్పాటు చేయడానికి, వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడానికి ప్రయత్నించిందని అమెరికా ఆరోపిస్తోంది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్‌కు చెందిన సముద్ర వనరులు, ఆయిల్ ట్యాంకర్లపై కూడా దాడులు చేసినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.

ఇరాన్‌లోని సిరిక్ ప్రాంతం సమీపంలో జరిగిన అమెరికా దాడిలో ఓ వివాహ వేడుకకు సంబంధించిన ప్రాంతం దెబ్బతిని పలువురు పౌరులు మరణించినట్లు ఇరాన్ వర్గాలు చెబుతున్నాయి. చిన్నారితో సహా పౌరులు మృతి చెందినట్లు స్థానిక నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే అమెరికా మాత్రం పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయలేదని స్పష్టం చేసింది. పెళ్లింటిపై అమెరికా చేసిన బాంబు దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ ప్రతిజ్ఞ పూనింది.

ట్రంప్ జలసంధిగా మార్చేద్దామా?

హార్ముజ్ జలసంధిపై అమెరికాకు దాదాపు పూర్తి నియంత్రణ ఉందని, ఇరాన్ చర్యలను తిరస్కరిస్తూ, టెహ్రాన్‌కు వ్యతిరేకంగా తిరగబడాలని ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ వ్యూహాత్మక జలమార్గం అమెరికా సైనిక నియంత్రణలో ఉన్నందున, హార్ముజ్ జలసంధికి ట్రంప్ జలసంధిగా పేరు మార్చాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సూచించారు. ఇప్పుడు ఇది అమెరికా నియంత్రణలోకి వచ్చింది కాబట్టి, మనం హార్ముజ్ జలసంధి పేరును ట్రంప్ జలసంధిగా మార్చాలా??? అమెరికాలాగే, ఇది కూడా మునుపెన్నడూ లేనంత వేడిగా మారుతుంది! అని ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో ట్రంప్ రాశారు.

## బీసీ మహిళ కాబట్టే కుట్రలు

మొదటి తరువాయి

వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను కూడా కలిసి విషయాలన్నీ వివరించినట్లు సురేఖ తెలిపారు. కేసీ వేణుగోపాల్‌ను కలవాలని ప్రయత్నించినప్పటికీ ఆయన బిజీగా ఉండటంతో భేటీ కాలేకపోయానని, తాను ఖర్గేను కలిసి కిందకు వచ్చేలోపే ఆయన వెళ్ళిపోయారని చెప్పారు. ఈ విషయంపై ఖర్గే సానుకూలంగా స్పందించారని తెలిపారు. చూద్దాం అన్నారని, పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారని సురేఖ వెల్లడించారు. తన కుమార్తె వివాహం జరిగి ఇండిపెండెంట్‌గా జీవిస్తున్న వ్యక్తి అని, ఆమె తన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు కలిగి ఉందని, ఆమె మాట్లాడిన దానికి నాకు షోకాజ్ ఇవ్వడం బాధ కలిగించిందని చెప్పారు. బీసీ మహిళగా తాను తన వాదనను అధిష్టానం ముందు చెప్పుకున్నానన్నారు.

తెలంగాణలో బీసీల రాజకీయ ప్రాధాన్యతను కూడా ఆమె ప్రస్తావించారు. తాను మంత్రిగా సమర్థంగా పనిచేస్తున్నానని, తనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని, తనకు అప్పగించిన శాఖలను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నానని మంత్రి సురేఖ చెప్పారు. అందువల్ల తనను మంత్రి పదవిలో కొనసాగించాలని ఖర్గే, మీనాక్షినటరాజన్‌ను కోరినట్లు వెల్లడించారు. మరోవైపు తనపై ఫిర్యాదులు చేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసీసీ తనపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసిన అంశంపై స్పందిస్తూ.. తనకు షోకాజ్ ఇవ్వడమే తప్పని, ఫిర్యాదుల ఆధారంగా పీసీసీ ఆ విధంగా సిఫారసు చేసిందని వ్యాఖ్యానించారు.

పార్టీ తననేమీ అడగలేదని, వాళ్లు అడిగినప్పుడు, ఆ సమయంలో పరిస్థితిని బట్టి తన నిర్ణయం ఉంటుంది అని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా టికెట్లు ఇస్తానని ప్రకటిస్తున్న అంశంపై ప్రశ్నించగా.. అది పార్టీ అంతర్గత వ్యవహారమని, దానిపై తాను వ్యాఖ్యానించబోనని చెప్పారు.

## 4న జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం

**-తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ వి.నారాయణన్**
**-ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్న ఇస్రో**
**-జీఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది 19వ ప్రయోగం**
**-సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం**
**-జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్-05**
**-భూమి పరిశీలనకు ఉపగ్రహం ద్వారా కీలక చిత్రాల సేకరణ**
**ప్రయోగం విజయవంతం కావాలని శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్**



తిరుమల

సెప్టెంబర్ 4వ తేదీన జీఎస్ఎల్వీ–ఎఫ్17 రాకెట్‌ను ప్రయోగించనున్నారు. ఈ నేపథ్యంలో ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇవాళ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. జీఎస్ఎల్వీ కేటగిరీలో ఇది 19వ రాకెట్ కావడం విశేషం. ఈ రాకెట్ ద్వారా నింగిలోకి ఈఓఎస్–05 ఉపగ్రహాన్ని తీసుకెళ్లనున్నారు. జియో ప్లాట్‌ఫామ్‌పై ప్రయోగిస్తున్న తొలి భారతీయ ఉపగ్రహం ఈఓఎస్–05 అని నారాయణన్ తెలిపారు.సబ్–జీటీవో కక్ష్యలోకి ఈఓఎస్–05 శాటిలైట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సతీశ్ ధావన్ స్పెస్ సెంటర్‌లోని రెండో లాంచ్ ప్యాడ్ నుంచి జీఎస్ఎల్వీ–ఎఫ్17ను ప్రయోగించనున్నారు. దీని పేలోడ్ ఫేరింగ్ 4 మీ దయామీటర్లు ఓగీవ్‌గా పేర్కొన్నారు. ఈఓఎస్–05 అనేది ఎర్త్ అబ్జర్వేషన్ స్పేస్‌క్రాఫ్ట్. దీని ద్వారా భూమిను పరిశీలించనున్నారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి ఈ శాటిలైట్ ఇమేజ్‌లను తీస్తుంటుంది.

# రామ మందిరం తొలి సీఈవోగా జితేంద్ర మిశ్రా

**అయోధ్య, సెప్టెంబర్ 2**



అయోధ్య రామ మందిరం తొలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా మాజీ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా నియామకాన్ని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ బుధవారం ఆమోదించింది. దేవరియాకు చెందిన మిశ్రా ఆపరేషన్ సిందూర్ సమయంలో వెస్టర్న్ ఎయిర్ కమాండ్ అధిపతిగా ఉన్నారు. రామ మందిరంలో విరాళాల చోరీ జరిగినట్టు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తన మూడవ సమావేశాన్ని బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ముగ్గురు కొత్త ట్రస్టీలను ట్రస్ట్ ప్రకటించింది. వీరిలో ఒక మహిళ కూడా ఉన్నారు.ఢిల్లీకి చెందిన మహేష్ భాగ్‌చంద్కా, అయోధ్య న్యాయవాది మదన్ మోహన్ పాండే, ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న షికోహాబాద్‌కు చెందిన నిర్మలా యాదవ్ ట్రస్టీలుగా నియమితులయ్యారు. విశ్వ హిందూ పరిషద్(వీహెచ్‌పీ) మాజీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్‌కు బంధువైన మహేష్ భాగ్‌చంద్కా 2020లో రామ మందిర భూమిపూజ సందర్భంగా నిర్వహించిన ధార్మిక కార్యక్రమంలో ఆయన ప్రధాన యజమానిగా వ్యవహరించారు. 2024 జనవరి 22న రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో కూడా ఆయన యజమానిగా వ్యవహరించారు. దేశ ప్రజలకు సేవ చేసే అవకాశం తనకు ఈ కొత్త బాధ్యతను స్వీకరించేలా ప్రేరణ ఇచ్చిందని జితేంద్ర మిశ్రా(రిటైర్డ్) అన్నారు.

# సైబర్ జాగృక్త దివాస్ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

- డిజిటల్ పేమెంట్స్‌లో అప్రమత్తతే సైబర్ మోసాల నివారణకు ప్రధాన రక్షణ
- ఆన్‌లైన్ షాపింగ్, పెట్టుబడి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలి
- వినాయక మండపాలలో సైబర్ అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులకు సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు
- జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్




**మిడ్జిల్, సెప్టెంబర్ 2, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర డీజీపీ సి.వి.ఆనంద్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీసబ్ ) డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. సైబర్ జాగృక్త దివాస్ సందర్భంగా బుధవారం జడ్చర్ల పట్టణంలోని డాక్టర్ బిఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో సుమారు 400 మంది విద్యార్థులకు నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిజిటల్ పేమెంట్స్ & డిజిటల్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు, పెట్టుబడి మోసాలు, సోషల్ మీడియాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై విద్యార్థులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**డిజిటల్ పేమెంట్స్ & డిజిటల్ సెక్యూరిటీ:**
డిజిటల్ చెల్లింపులు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం/సీవీవీ, బ్యాంక్ ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించరాదని తెలిపారు. తెలియని వ్యక్తులు పంపించే లింకులు, క్యూఆర్ కోడ్‌లు, అనుమానాస్పద యాప్‌లను ఉపయోగించరాదని, డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన సందేశాలు, నోటిఫికేషన్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వస్తువులను కొనుగోలు చేసే సమయంలో నకిలీ వెబ్‌సైట్లు, నకిలీ ఆఫర్లు, తక్కువ ధరల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని వెబ్‌సైట్లు లేదా వ్యక్తులకు ముందస్తుగా డబ్బులు చెల్లించే ముందు వాటి విశ్వసనీయతను పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్ పెట్టుబడులు, ట్రేడింగ్, అధిక లాభాల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే వ్యక్తులు, సోషల్ మీడియా గ్రూపులు, అనుమానాస్పద యాప్‌లు, లింకులను నమ్మి డబ్బులు పెట్టుబడి పెట్టవద్దని సూచించారు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ విశ్వసనీయతను పూర్తిగా పరిశీలించాలని తెలిపారు. విద్యార్థులు సోషల్ మీడియాను ఉపయోగించే సమయంలో తమ వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకింగ్ సమాచారం, వ్యక్తిగత ఫొటోలు, లొకేషన్ వంటి సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, మెసేజ్‌లు, లింకులను అంగీకరించకుండా జాగ్రత్త వహించాలని, బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకుని టూ-ఫ్యాక్టర్ ఆథెంటికేషన్‌ను ఉపయోగించాలని తెలిపారు. సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్ కాకుండా ప్రైవసీ సెట్టింగులను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే నేషనల్ Cyber క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (NCRP)లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే నగదు రికవరీకి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.



సైబర్ నేరాల నివారణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, తాము అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం, సైబర్ మోసం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని పేర్కొన్నారు. అనంతరం టీజీసీసబ్ వారు విడుదల చేసిన సైబర్ నేరాలపై అవగాహన కల్పించే ప్రత్యేక వినాయక పోస్టర్లను జిల్లా ఎస్పీ గారు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాబోయే వినాయక చవితి సందర్భంగా జిల్లాలోని ప్రతి వినాయక మండపం వద్ద ఈ పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. వినాయక మండపాలకు దర్శనం కోసం వచ్చే భక్తులు, ప్రజలు ఈ పోస్టర్లను చూసి ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన పొందే అవకాశం ఉంటుందని, తద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలకు సైబర్ భద్రతపై సందేశాన్ని చేరవేయవచ్చని ఎస్పీ తెలిపారు. ప్రతి వినాయక మండపం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే వేదికగా మారేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
జిల్లాలోని ప్రతి ఒక్కరికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించి అప్రమత్తం చేయడం పోలీసు శాఖ బాధ్యత అని, ప్రజల సహకారంతోనే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్, జడ్చర్ల ఇన్‌స్పెక్టర్ కమలాకర్, కళాశాల ప్రిన్సిపల్ సుకన్య, వైస్ ప్రిన్సిపాల్స్ నర్మదా, శ్రీనివాసులు, సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్, D4C సిబ్బంది మరియు సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించేందుకు స్క్రీనింగ్ చేయించుకోవాలి: ఎంపీ డీకే అరుణ





**మిడ్జిల్, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):** బాలానగర్ మండలంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి పీహెచ్‌సీ పరిధిలో స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అనుమానిత కేసులకు వెంటనే తదుపరి పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. స్క్రీనింగ్‌లో గుర్తించిన కేసులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఏ. శ్రీనివాసులు మాట్లాడుతూ, ఆశా కార్యకర్తల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామని, త్వరలో అన్ని మండల కేంద్రాల్లో స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, ఫ్యూయలింగ్ గ్రోత్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జాతి కోసం.. జనం కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం

- 12న టీఎంజేఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేద్దాం
- రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి సురేందర్ పిలుపు



**మిడ్జిల్, సెప్టెంబర్ 02, (నేటి దర్శిని):** మిడ్జిల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జాతి కోసం.. జనం కోసం తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం పనిచేస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి సురేందర్ అన్నారు. ఈ నెల 12న హైదరాబాద్ కోఠిలోని బీసీసీ భవన్‌లో నిర్వహించే టీఎంజేఎఫ్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం మిడ్జిల్‌లో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రాచాలపల్లి భీమయ్య, కో-కన్వీనర్లుగా బరిగేల శ్రీనివాస్, జి.రాజేష్, జిల్లా ముఖ్య సలహాదారుగా బరిగేల వెంకటయ్యను ఎన్నుకున్నారు. జర్నలిస్టులకు రూ.4.20 లక్షలతో జర్నలిస్టు బంధు, ఉచిత విద్య, వైద్యం, బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మ్యాథరి దాసు, పుల్లగల్ల శ్రీధర్, ప్రతాప్, ఆకుల విజయ్, మల్లేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# భరోసా కేంద్రంతో బాధితులకు అన్నివిధాల అండ

- రక్షణ, వైద్యం, న్యాయ సహాయం, కౌన్సెలింగ్‌తో సమగ్ర సేవలు
- పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డి.జానకి



**మిడ్జిల్, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో):** మహిళలు, బాలికలు సమస్యలను ఎదుర్కొన్నప్పుడు వివిధ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే చోట సమగ్ర సేవలు అందించడమే భరోసా కేంద్రం ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా భరోసా కేంద్రం ద్వారా మహిళలు, బాలికలకు అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన "భరోసా కేంద్రం -- ఒకే చోట అన్ని సేవలు" పోస్టర్‌ను ఎస్పీ డి. జానకి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రత, రక్షణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను లేదా భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. బాధితులకు తక్షణ రక్షణ కల్పించడంతో పాటు, వారి సమస్యలను సున్నితంగా అర్థం చేసుకుని అవసరమైన సహాయాన్ని అందించేందుకు భరోసా కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. భరోసా కేంద్రంలో కౌన్సెలింగ్, పోలీస్ సహాయం, వైద్య సేవలు, న్యాయ సలహాలు, పునరావాసం, విద్య--ఉపాధి సంబంధిత సహాయం వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని ఎస్పీ వివరించారు. బాధిత మహిళలు, బాలికలకు మానసిక ధైర్యం కల్పించి, వారు తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించేలా అవసరమైన సహకారం అందించడం కేంద్రం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు, బాలికలు తమ సమస్యలను దాచుకోకుండా ధైర్యంగా ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. "బాధితులకు రక్షణ, న్యాయం, భద్రతతో పాటు భవిష్యత్తుపై నమ్మకం కల్పించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. వేధింపులు, హింస, లైంగిక దాడులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు తక్షణమే పోలీసులను లేదా భరోసా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. బాధితుల గోప్యతకు ప్రాధాన్యత ఇస్తూ, వారికి అవసరమైన సేవలను సమన్వయంతో అందిస్తామని తెలిపారు. ప్రతి మహిళ, ప్రతి బాలికకు భద్రత, గౌరవం, న్యాయం అందేలా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింలు, భరోసా ఇన్‌చార్జి ఎస్‌ఐ అరుణ, భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైయస్సార్

- ఘనంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17 వర్ధంతి వేడుకలు

**ఆమనగల్లు, సెప్టెంబర్ 02(నేటి దర్శిని);** మరపురాని మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను బుధవారం ఆమనగల్లు లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవ్వారి శివలింగం, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసి పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల గుండెల్లో వైయస్సార్ కు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన ఆశయాలను కొనసాగించడమే కాంగ్రెస్ కార్యకర్తల లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మార్కెట్



కమిటీ డైరెక్టర్ వప్పుల శ్రీశైలం, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి ,ధనంజయ, కాలే మల్లయ్య,ఆదివాసి రాష్ట్ర నాయకుడు కృష్ణ నాయక్, ఐఎన్ టియుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, బాబా,దేవరశెట్టి మహేష్, రాజు ఎండి అబ్దుల్ రహీం, కరీం, పసుపుల శ్రీకాంత్, బొబ్బిలి,పూసల పరమేష్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు.. ఉప్పొంగుతున్న నదులు..!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని)**
హిమాలయ దేశం నేపాల్ ను భారీ వర్షాలు , వరదలు ముంచెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో పలు ప్రధాన నదులు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రమాదకరస్థాయికి చేరువయ్యాయి. ఈ నేపథ్యంలో అధికారులు దేశంలోని మధ్య, పశ్చిమ, తూర్పు ప్రాంతాల ప్రజలకు వరద హెచ్చరికలు జారీచేశారు. ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.నేపాల్ హైడ్రాలజీ అండ్ మెటియరాలజీ విభాగం ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 6 గంటలప్పటికి మూడు ప్రధాన నదుల్లో నీటిమట్టాలు హెచ్చరిక స్థాయిని దాటాయి. సింధూలి జిల్లాలోని సన్ కోశీ నది, గూర్ఖా జిల్లాలోని బుధి గండకి నది, దడెల్ధురా జిల్లాలోని మహాకాళి నదుల్లో నీటి ప్రవాహం ఆందోళనకరంగా ఉంది. ఈ నదుల్లో నీటిమట్టం



మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు లమ్‌జంగ్ జిల్లాలోని మర్స్యంగ్ది నదిలో ప్రవాహం ఇప్పటికే ప్రమాదకర స్థాయిని దాటింది. నిన్న రాత్రి 11:15 గంటలకు భుకుందెబెసి వాటర్ లెవెల్ మానిటరింగ్ కేంద్రం వద్ద ఈ నది ప్రమాద స్థాయిని దాటినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ నదిలో నీటిమట్టం ఇంకా పెరుగుతూనే ఉందని, ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫ్లడ్ ఫోర్‌కాస్టింగ్ డివిజన్ పేర్కొన్నది. దాంతో నదీ పరివాహక ప్రాంతాల్లో వరద ముప్పు ఎక్కువగా ఉందని హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రజలకు కీలక సూచనలు చేసింది. ముఖ్యంగా మర్స్యంగ్ది నది దిగువ ప్రాంతాల ప్రజలు వెంటనే అప్రమత్తం కావాలని కోరింది. నదీ తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రాజధాని ఖాట్మండు సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున, ప్రజలు అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని అధికారులు సూచించారు.

# యూపీలో అసదుద్దీన్ ఒవైసీకి షాక్

**- మజ్లిస్ కీలక నేత కాంగ్రెస్‌లోకి జంప్..!**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని)**
ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ పార్టీ కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా, యూపీలో కీలకనేతగా గుర్తింపు పొందిన సయ్యద్ అసిమ్ వకార్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. లక్నోలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు.దాదాపు దశాబ్ద కాలంగా ఎంఐఎంలో కొనసాగుతున్న వకార్.. పార్టీ విధానాలపై



తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "బీజేపీని, దాని సిద్ధాంతాలను ఎదుర్కొంటామని ఎంఐఎం చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పార్టీకి వ్యతిరేకంగా పోరాడుతున్న కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల వంటి లౌకిక శక్తులకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. "దేశంపై ప్రేమ ఉన్న ప్రజలు బీజేపీ నేతృత్వంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించాలని కోరుకుంటున్నారు. మనం నిజమైన దేశభక్తులమై ఉండి, బీజేపీని నిజాయతీగా అధికారం నుంచి తొలగించాలనుకుంటే, ఆ పార్టీతో రాజీలేని పోరాటం చేస్తున్న కాంగ్రెస్‌తో కలిసి నడవాలి" అని వకార్ స్పష్టం చేశారు. వకార్ ఎంఐఎంలో చేరడానికి ముందు సుమారు 20 ఏళ్లపాటు సమాజ్‌వాదీ పార్టీలో పనిచేశారు. ఇదిలావుండగా 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం 95 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. అదే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం రెండు స్థానాల్లో మాత్రమే విజయం

# సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ టెక్నాలజీని ఇరాన్‌కు ఇచ్చిన రష్యా !

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని)**
ఇరాన్‌కు రష్యా సీక్రెట్‌గా సహకరిస్తున్నది. సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్ల ను డెవలప్ చేసేందుకు ఇరాన్‌కు రష్యా సహకరిస్తున్నట్లు తెలిసింది. సీ430ఎల్ పేరుతో ఆ మిషన్ చేపట్టారు. పశ్చిమాసియా ప్రాంతంలో అమెరికా యుద్ధనౌకలను ఎదుర్కొనే రీతిలో ఆ క్షిపణులను అభివృద్ధి చేస్తున్నారు. రష్యన్ ఇంటెలిజెన్స్ నుంచి లీకైన సమాచారం ఆధారంగా ఈ అంచనా వేస్తున్నారు. 2023లో ఈ ప్రోగ్రామ్ స్టార్ట్ య్యింది. అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభం కావడానికి ముందే ఆ ప్రోగ్రామ్ ప్రారంభమైనట్లు తెలిసింది.ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా రామ్‌జెట్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను డెవలప్ చేస్తున్నారు. ధ్వని వేగం కన్నా అధిక వేగంతో వెళ్లే క్రూయిజ్ క్షిపణులకు చెందిన ఇంజిన్లను ఈ టెక్నాలజీతో తయారు



చేయవచ్చు. చాలా సున్నితమైన, వ్యూహాత్మక మిలిటరీ టెక్నాలజీని రష్యా బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అయితే అత్యున్నత స్థాయి రాజకీయ క్లియరెన్స్ లేకుండా ఈ ప్రోగ్రామ్‌ను చేపట్టడం సాధ్యం కాదు, అంటే దీనికి దేశాధ్యక్షుడి అనుమతి ఉండి ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. ఇరాన్ స్వయంగా రామ్‌జెట్ ప్రొపల్షన్ సిస్టమ్‌ను డెవలప్ చేసి, క్షిపణులను నిర్మించినట్లు ఓ రిపోర్టు ద్వారా వెల్లడైంది. ఆ టెక్నాలజీ రష్యా ఏమీ ఇవ్వలేదని అంటున్నారు. ఒకవేళ రామ్‌జెట్ టెక్నాలజీ ఇరాన్ వద్ద ఉంటే, అప్పుడు అమెరికా నౌకలకు ఇబ్బంది తప్పదని మిలిటరీ విశ్లేషకుడు జిమ్ లామ్సన్ తెలిపారు. అయితే రష్యాకు చెందిన ఆయుధ కంపెనీ రోసోబోరన్‌ఎక్స్‌పోర్ట్ సీ430ఎల్ ఆపరేషన్ చేపట్టినట్లు తెలిసింది. రష్యా రాకెట్ డిజైన్ బ్యూరో ఎన్పీవో మషినోస్ట్రోయేనియా కూడా ఈ ప్రాజెక్టుకు సహకరించింది.

# 'జీవితమంటే రన్నింగ్ రేస్ కాదు'..

**-ఐఐటీ గువాహటి విద్యార్థులతో అస్సాం ముఖ్యమంత్రి**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని)**
ఐఐటీ గువాహటి కి చెందిన 100 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ లు అందించాలని అస్సాం ముఖ్యమంత్రి హిమాంత బిశ్వశర్మ నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను ఆయన ఆదేశించారు. సెప్టెంబర్ 1న జరిగిన ఐఐటీ గువాహటి 33 వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐఐటీ గువాహటి కేవలం విద్యలో ప్రతిభ చూపించే సంస్థ



కాదని.. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు.ఐఐటీ గువాహటి విద్యార్థుల కోసం అస్సాం ప్రభుత్వం 100 స్కాలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని త్వరగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సంబంధిత అధికారులను, ఐఐటీ గువాహటి డైరెక్టర్‌ను కోరారు. అస్సాం ఎదుర్కొనే సంక్లిష్టమైన సాంకేతిక, అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కనుగొనడంలో ఐఐటీ గువాహటి కీలకపాత్ర పోషిస్తుందని హిమంత బిశ్వ శర్మ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగానే ఐఐటీ గువాహటి విద్యార్థులకు సీఎం ప్రత్యేక సందేశాన్ని కూడా ఇచ్చారు. జీవితం పరుగు పందెం కాదని, మీరు అందరికంటే వేగంగా ముందుకు వెళ్లకపోయినా పర్వాలేదని హిమాంత అన్నారు. దానివల్ల మీరు వెనుకబడినట్లు భావించాల్సిన అవసరం లేదని సీఎం హిమంత బిశ్వశర్మ సూచించారు.

# ఒంటికాలితో కుంటుతూ పాఠశాలకు

- -యూపీలో ఏడేళ్ల బాలిక దైన్యం.. చదువుపై చెక్కుచెదరని పట్టుదల
- -ఆరు నెలల వయసులో ప్రమాదంలో కాలును కోల్పోయిన రాగిణి
- -పేదరికం వెంటాడినా చదువుపై ఆసక్తి
- -ఇంటివద్ద పిల్లలను చూసి స్కూల్‌కు వెళ్లాలని పట్టుదల
- -తల్లిదండ్రులు పాఠశాలలో చేర్పించడంతో విద్యాభ్యాసం ప్రారంభం
- -వీపుపై బ్యాగ్‌తో ఒంటికాలిపై కుంటుకుంటూ స్కూల్‌కు రాక
- -రాగిణి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్

**లక్నో, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని)**
ఏడేండ్ల రాగిణి వీపుపై బ్యాగ్‌తో ఒంటి కాలితో కుంటుకుంటూ పాఠశాలకు వస్తున్న దృశ్యం ఇప్పుడు మీడియాలో వైరల్ అయ్యింది. యూపీలోని



బల్లియాకు చెందిన ఈ బాలిక ఆరు నెలల వయసులో ఉన్నప్పుడు జరిగిన ఒక ప్రమాదంలో ఒక కాలును కోల్పోయింది. పేదవారైన తల్లిదండ్రులు తమ శక్తికొద్దీ దవాఖానల చుట్టూ తిరిగి చికిత్స చేయించినా ఆమె కాలు నయం కాలేదు. ఇంటి ముందర నుంచి పలువురు పిల్లలు పాఠశాలకు వెళ్లడాన్ని చిన్నప్పటి నుంచి చూసిన రాగిణి తాను కూడా స్కూల్‌కు వెళ్తానని పట్టుబట్టింది. దీంతో ఆమెను ఒక పాఠశాలలో చేర్పారు.

# సంపాదకీయం

## అణ్వస్త్ర సన్యాసమే శాంతికి నాంది



ఆధునిక కాలంలో సామ్రాజ్యవాదం అంటే, కేవలం భౌగోళికంగా దేశాలను ఆక్రమించుకోవడమే కాదు, సైనిక, ఆర్థిక, సాంకేతిక ఆధిపత్యాల ద్వారా ఇతర దేశాలను సామ్రాజ్యవాద దేశాలు తమ గుప్పిట్లో ఉంచుకోవడం. ఈ ఆధునిక సామ్రాజ్యవాదానికి అణ్వాయుధాలు అతిపెద్ద ఆయుధాలుగా మారాయి. అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలు అధికారికంగా అణ్వాయుధాలు కలిగి ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అణ్వాయుధాల తయారీలో, నిల్వల్లో రష్యా-, అమెరికా అత్యంత అగ్రస్థానం లో ఉన్నాయి. ప్రపంచంలో ఉన్న మొత్తం అణ్వాయుధాల్లో 90% ఈ రెండు దేశాలే కలిగి ఉన్నాయి. ప్రపంచంలోనే రష్యా అత్యధికంగా 5,500 పైగా అణ్వాయుధాలు కలిగి ఉంది. 5,044 అణ్వాయుధాలతో అమెరికా రెండవ స్థానంలో ఉంది. చైనా 540 పైగా అణ్వాయుధాలతో మూడవ స్థానంలో ఉంది. ఆ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్‌లు ఉనాయి. అణ్వాయుధాలపై ఆధిపత్య కలిగిన దేశాలు ముఖ్యంగా అమెరికా కొత్తగా ఏ దేశం అణుబాంబులు తయారు చేయకుండా అడ్డుకొంటున్నది.ఇది ప్రపంచ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. అణ్వాయుధాలతోపాటు విపరీతంగా ఇతర ఆధునిక ఆయుధాలు కలిగిన అమెరికాకు, అణ్వాయుధాలతోపాటు ఆధునిక ఆయుధ సంపత్తి లేని దేశాలు భయపడాల్సి వస్తున్నది. అసమానతలతో కూడిన ఐక్యరాజ్య సమితి చేసిన అణువ్యాప్తి నిరోధక ఒప్పందం ద్వారా కొత్తగా ఏ దేశం అణ్వాయుధాలను తయారు చేయకుండా నిరోధించడం, శాంతియుత అవసరాలకోసం మాత్రమే అణుశక్తిని వినియోగించేలా చేయడం ఈ ఒప్పందం లక్ష్యంగా ప్రకటించబడింది. ఇది 1970 మార్చి 5 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ ఒప్పందం ద్వారా ఐక్యరాజ్య సమితి అణ్వాయుధాలు, అపార సైనికశక్తి ,ఆర్థిక బలం కలిగిన సామ్రాజ్యవాద దేశాలకు ముఖ్యంగా అమెరికాకు వెనుకబడిన దేశాలు లొంగి ఉండాలని చెప్పకనే చెబుతున్నది. ఈ ఒప్పందాన్ని అనేక దేశాలు వ్యతిరేకించాయి. ఇతర దేశాలు అణ్వాయుధాలు తయారు చేయకుండా ఒప్పందం నిరోధిస్తున్నప్పుడు, ఏ దేశం దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదు. అమెరికాతోపాటు అణ్వాయుధాలు ఉన్న దేశాలన్నీ వాటిని నాశనం చేసే చర్యలు తీసుకోవాలి. కాని అణు ఒప్పందంలో అలాంటి అంశం లేదు. అలాంటప్పుడు ప్రపంచ ప్రజలకు అణు యుద్ధ ప్రమాదం పొంచి ఉంటూనే ఉంటుంది. చైనాతోపాటు ప్రపంచ దేశాల్లో ఉన్న అణ్వాయుధాల అన్నింటినీ నాశనం చేద్దాం మావో నాయకత్వాన చైనా ప్రకటించడాన్ని ప్రత్యేకంగా గమనించాల్సిన అంశం. 1945లో అమెరికా అణుబాంబు తయారు చేసిన తొలి దేశంగా దాని ఆధిపత్యం కొనసాగింది. ఆ తర్వాత బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాలు 1949 తయారు చేశాయి. అమెరికా యుద్ధోన్మాద చర్యలను ఎదుర్కోవడానికి మాత్రమే స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ అణుబాంబు తయారు చేసింది. అమెరికా అణ్వాయుధాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా మావో నాయకత్వాన 1964లో ప్రజా చైనా అణుబాంబును తయారు చేసింది. ఆ తర్వాత 1974 భారత్, 1998లో పాక్ అణుబాంబులు తయారు చేశాయి. 2006 లో ఉత్తర కొరియా అణుబాంబు తయారీలో విజయవంతమైంది. అమెరికా సామ్రాజ్యవాదం అంతర్జాతీయ రాజకీయాల్లో వివాదాలకు మూల కారణంగా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తన అణ్వాయుధ ఆధిపత్యాన్ని, సైనిక శక్తిని ఉపయోగించి అమెరికా ప్రపంచవ్యాప్తంగా తన రాజకీయ, ఆర్థిక విధానాలను అమలు చేయడానికి బలహీన దేశాలను దౌత్య, సైనికపరంగా బెదిరించింది. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిపై అణుబాంబు దాడి ద్వారా సోవియట్ యూనియన్‌కు తన సైనికశక్తిని చూపి భయపెట్టడానికేనని రాజకీయవేత్తలు చెప్పారు. కాని సోవియట్ యూనియన్‌నే అమెరికా భయం కలిగించింది. కొరియాతో యుద్ధ(1950-53) సమయంలో ఉత్తర కొరియా, చైనాలను లొంగదీసుకోవడానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ట్రూమన్, జనరల్ మాక్ అర్థర్ అణ్వాయుధాలను ఉపయోగిస్తామని బెదిరించారు. ఆ బెదిరింపులను చైనా, ఉత్తర కొరియా తిప్పికొట్టాయి. తన సరిహద్దుల్లో సోవియట్ క్షిపణులు ఉన్నాయని క్యూబాను పూర్తిగా నాశనం చేస్తానని బెదిరించి మూడవ ప్రపంచ యుద్ధ ప్రమాదం అంచువరకు తీసుకువెళ్లింది. వియత్నాంలో కమ్యూనిస్టుల సాయుధ పోరాటాన్ని ఓడించడానికి అణ్వాయుధాలను ఉపయోగించే ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇరాక్ వద్ద సామూహిక వినాశకర ఆయుధాలు ఉన్నాయనే అబద్ధపు నెపంతో అమెరికా ఆ దేశంపై దాడి చేసి సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని కూల్చి ఆయన్ను ఉరితీసింది. ప్రపంచ వ్యాప్తంగా అమెరికాకు 800 పైగా సైనిక స్థావరాలు ఉన్నాయి. రష్యా సరిహద్దులకు సమీపం లోనూ, వ్యూహాత్మక సముద్ర మార్గాల్లోను ఈ సైనిక స్థావరాలు ఏర్పాటు చేసింది. అణ్వాయుధాలను, అగ్రరాజ్యాలను నియంత్రించడంలో ఐరాస వైఫల్యానికి ప్రధాన కారణం వాటి రాజకీయ ఆధిపత్యం, భద్రతా మండలి ఏర్పాటులో ఉన్న లోపాలు కారణంగా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధ వ్యాప్తిని అరికట్టడానికి ఐక్యరాజ్య సమితిలో అనేక ఒప్పందాలు జరిగినా అవి ఆయుధ పోటీని ఆపడంలో వైఫల్యం చెందాయి. ఫలితంగా ఒప్పందాలన్నీ అలంకారప్రాయంగా మారాయి. భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్ , ఫ్రాన్స్‌లకు వీటో పవర్ కల్పించబడింది. అందువల్ల ఇవి వీటో పవర్‌తో ఐక్యరాజ్య సమితిని శాసిస్తున్నాయి. ముఖ్యంగా ఐరాసలో తన మాటనెగ్గేలా అమెరికా చేసుకున్నది. ఒక తీర్మానాన్ని ఐరాసలో మెజారిటీ దేశాలు ఆమోదించిన వీటో పవర్ ఉన్న దేశం వీటో (వ్యతిరేకిస్తే) చేస్తే ఆ తీర్మానం ఆమోదం పొందదు. వీటో పవర్‌ను అత్యధికంగా అమెరికా ప్రయోగించింది. అమెరికా దురాక్రమణ యుద్ధాలను, పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని, పసిపాపలతోసహా గాజా ప్రజల ఊచకోతను ఆపాలని అత్యధిక దేశాలు తీర్మానాలు చేసినా ఆమోదించినా, అమెరికా వీటో ప్రయోగించి అడ్డుకున్నది. అణ్వాయుధ యుద్ధ ప్రమాదాల భయం లేకుండా ప్రపంచ దేశాల ప్రజలు ఉండాలంటే, అణ్వాయుధాల తయారీకి వ్యతరేకంగానే కాకుండా, అవి ఉన్న అన్ని దేశాల్లో ప్రజలకు ప్రమాదం రాకుండా చాలా జాగ్రత్తగా నాశనం చేయాలి. అలా జరగాలంటే ప్రపంచ ప్రజలందరూ సామ్రాజ్యవాదానికి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఐక్య గొంతుతో ఉద్యమించాలి.

# కాంగ్రెస్ వైఫల్యాలపై ఆమనగల్లులో బీఆర్ఎస్ కదనభేరి



●గులాబీమయమైన ఆమనగల్లు.. ఈనెల 5న కల్వకుర్తిలో సమరభేరి



**ఆమనగల్లు, సెప్టెంబర్ 02(నేటి దర్శిని);** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆమనగల్లులో కదనభేరి నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ గుప్తా పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడుగుల, చారకొండ మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు,మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆమనగల్లు గులాబీమయంగా మారింది.పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవాలయం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించి శ్రీలక్ష్మీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. ఉప్పల వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో జరిగిన సభకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం, ఆమనగల్లు సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, రజనీ సాయిచంద్, విజితా రెడ్డి తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు భరోసా, వరికి రూ.500 బోనస్, రైతు కూలీలకు ఉపాధి హామీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, మహిళలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులు, దివ్యాంగులకు పింఛన్ల పెంపు వంటి హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద తులం బంగారం, విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం కుంటుపడ్డాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రైతు భరోసా, రైతు బీమా, యూరియా, విద్యుత్, భూ సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గడపగడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈనెల 5న కల్వకుర్తిలో రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో భారీ సమరభేరి నిర్వహించనున్నట్లు జైపాల్ యాదవ్, ఉప్పల వెంకటేష్ గుప్తా తెలిపారు. ప్రజలకు మేలు చేయని ప్రభుత్వాన్ని సాగనంపి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తీసుకురావాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి నుంచి ప్రభుత్వంపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఘనంగా బోనాల పండుగ

●పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి





**కల్వకుర్తి, సెప్టెంబర్ 02, (నేటి దర్శిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన బోనాల పండుగలో బీజేపీ రాష్ట్ర నాయకులు, నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, కరాటే అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.
ఈ సందర్భంగా ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, కౌన్సిలర్లు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖానాపూర్‌లో రిసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్





●ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రాల సందర్శించిన కలెక్టర్ కుష్బూ గుప్తా



**మిడ్జిల్, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని, మహబూబ్‌నగర్ జిల్లా బ్యూరో):** జడ్చర్ల మండలం ఖానాపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా బుధవారం పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న భూముల రిసర్వే పనులతో పాటు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ముందుగా గ్రామంలో జరుగుతున్న భూముల రిసర్వే పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. రిసర్వే ప్రక్రియకు గ్రామస్థులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆమె కోరారు. రిసర్వే ద్వారా భూముల వివరాలు, హద్దులు స్పష్టంగా నమోదవుతాయని, భవిష్యత్‌లో భూ సంబంధిత వివాదాలు, సమస్యలను నివారించేందుకు ఇది దోహదపడుతుందని తెలిపారు. గ్రామస్థులు తమ భూములకు సంబంధించిన సరైన వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. అనంతరం ఖానాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు గుడ్లు, ఇతర పౌష్టికాహారం సక్రమంగా అందుతున్నాయా అనే విషయాన్ని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ అక్కడ విద్యుత్, లైటింగ్, ఫ్యాన్లకు సంబంధించిన సమస్యలను గుర్తించారు. వాటిని తక్షణమే మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అంగన్‌వాడీ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. దీంతో సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని సర్పంచ్, గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.
ఈ పర్యటనలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి బోనాల్లో పాల్గొన్న సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి





**ఆమనగల్లు, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని);** కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన శ్రీ పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అభివృద్ధిలో భాగంగా భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్ నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు చెక్ రూపంలో అందజేశారు. ఆలయాల వద్ద భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగిస్తానని రాఘవేందర్ రెడ్డి తెలిపారు. అమ్మవారి సన్నిధిలో భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు రేకుల షెడ్ ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఈధమ్మ మాంధాత బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు రాఘవేందర్ రెడ్డి సేవాభావాన్ని అభినందిస్తూ, ఆలయ అభివృద్ధికి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం



● ఇందిరమ్మ ఇళ్లు ఒక పథకం కాదు.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీక
● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**తలకొండపల్లి, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని ):** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేస్తున్నామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు కేవలం పథకం కాదని, ఒక భరోసా, నమ్మకం, విశ్వాసమని పేర్కొన్నారు. వానైనా, ఎండైనా 'మనకంటూ ఒక ఇల్లు ఉంది' అనే ధైర్యాన్ని ఇందిరమ్మ ఇళ్లు కల్పిస్తాయని అన్నారు. తల్లిదండ్రుల కష్టానికి సొంతింటి చిరునామా, పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది, ప్రతి పేద కుటుంబం ఆత్మగౌరవానికి ఇందిరమ్మ ఇల్లు నిలువెత్తు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇల్లు నిర్మించడం మాత్రమే కాకుండా ఒక కుటుంబం కలను నిజం చేస్తున్నామనే తృప్తి ప్రజా ప్రభుత్వానికి ఉందన్నారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నరసింహ, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి డి. రఘురాములు, డీసీసీ కార్యదర్శి భగవాన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకట్‌రెడ్డి, అజీమ్, మాజీ సర్పంచ్ పి. రమేష్‌యాదవ్, జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, రాజేందర్‌రెడ్డి, చిత్తరంజన్, రాఘవేందర్, బండల శంకర్‌రెడ్డి, శివాజీ, వార్డు నెంబర్ కిట్టు, అయ్యన్న, మహేష్, ఆదర్శ్, బి. యాదగిరి, సిమ్మారెడ్డి, కృష్ణయ్య, సాకలి యాదగిరి, షర్ఫ్, దాసరి యాదయ్య, సాకలి అంజయ్య, జంగయ్య, మండల నాయకులు అంజయ్యగౌడ్, పి. అశోక్‌బాబు, బి. నర్సింలు, అజీజ్, జుట్టు తిరుపతయ్య ముదిరాజ్, అరిఫ్, రాజేందర్‌నాయక్, విష్ణు, పవన్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ఆరోగ్యానికి మానస హాస్పిటల్ చేయూత

● రూ.3,500 విలువైన కిట్లు పది మంది చిన్నారులకు పంపిణీ




**చింతపల్లి, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని) :** చింతపల్లి మండలం గోడకొండ్ల గ్రామంలోని మాల్ వీటీ నగర్‌లో ఏర్పాటు చేసిన మానస హాస్పిటల్ ఆధ్వర్యంలో చిన్నారులకు కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కటి రూ.3,500 విలువైన కిట్లను మొత్తం 10 మంది చిన్నారులకు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కాశగోని వెంకటయ్య మాట్లాడుతూ.. మానస హాస్పిటల్ యాజమాన్యం గ్రామ ప్రజలకు లాభాపేక్ష లేకుండా వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలు అందించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో డాక్టర్ మానస, డాక్టర్ దీపక్, హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు పంటకు నీటి ధోకా లేదు!

- డిండి జలాలు చుక్కా వృథా కాకూడదు.. చివరి ఎకరం వరకు సాగునీరు
- విద్యుత్ అంతరాయం వస్తే ఊరుకోం.. అధికారులకు ఎమ్మెల్యే బాలు నాయక్ గట్టి ఆదేశాలు



**దేవరకొండ, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని):**
వర్షాలు సకాలంలో కురవక నీటి లభ్యతపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో సాగులో ఉన్న పంటలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండిపోనివ్వబోమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు. డిండి ప్రాజెక్టు నీటిని అత్యంత పొదుపుగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించి చివరి వరకు పంటలకు సాగునీరు అందించాలని సాగునీటి అధికారులను ఆదేశించారు.విద్యుత్, సాగునీటి, పోలీస్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులకు, ప్రజలకు ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త విద్యుత్ స్తంభాలు, మార్పిడులు ఏర్పాటు చేయాలని సూచించారు. కాలిపోయిన మార్పిడులను వెంటనే మరమ్మతు చేసి సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు.నీటి ప్రతి చుక్కను లెక్కచేసి వినియోగించాలి.. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు చేతికొచ్చే వరకు డిండి నీటిని ప్రణాళికాబద్ధంగా విడుదల చేయాలని అధికారులకు సూచించారు. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేలా గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు."రైతులకు సాగునీరు, విద్యుత్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదు. పంటలు ఎండిపోకుండా చివరి వరకు నీరు అందించాలి. అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు అండగా నిలవాలి" అని ఎమ్మెల్యే బాలు నాయక్ స్పష్టం చేశారు.
సమీక్షలో విద్యుత్, సాగునీటి, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్ననాటి నుంచే ఆరోగ్యకర ఆహారమే అవసరం

- ఐసీఎంఆర్ --ఎన్ఐఎన్‌లో ఉత్తరాఖండ్ మీడియా బృందం పర్యటన
- ఆహార వైవిధ్యం, పోషక భద్రతపై డాక్టర్ భారతి సూచనలు
- పోషకాహార సమాచారంలో మీడియా బాధ్యత కీలకం





**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నేటి దర్శిని):**
చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవడం ఎంతో అవసరమని ఐసీఎంఆర్--నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఐసీఎంఆర్--ఎన్ఐఎన్) డైరెక్టర్ డాక్టర్ భారతి కులకర్ణి అన్నారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాద్ ప్రెస్ టూర్‌లో భాగంగా ఉత్తరాఖండ్‌కు చెందిన 15 మంది సభ్యుల మీడియా ప్రతినిధి బృందం బుధవారం ఐసీఎంఆర్--ఎన్ఐఎన్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా డాక్టర్ భారతి కులకర్ణి మాట్లాడుతూ.. ఆహార కూర్పు, పోషక అవసరాలు, ఆహార మార్గదర్శకాలపై శాస్త్రీయ ఆధారాలను రూపొందించడంలో ఐసీఎంఆర్--ఎన్ఐఎన్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దేశీయ ఆహార పదార్థాల్లోని శక్తి, ప్రోటీన్, సూక్ష్మపోషకాలు, ఖనిజాల వివరాలను అందించే ఇండియన్ ఫుడ్ కంపోజిషన్ టేబుల్స్ (ఐఎఫ్‌సీటీ) పరిశోధకులు, ఆహార పరిశ్రమ, ప్రజారోగ్య విధాన రూపకర్తలకు ముఖ్యమైన ఆధారంగా నిలుస్తున్నాయని వివరించారు. భారతీయుల పోషకాహార అవసరాలు, సిఫార్సు చేసే ఆహార భత్యాలు (ఆర్‌డీఏ) వివిధ వయస్సులు, శారీరక వర్గాలకు అవసరమైన పోషక ప్రమాణాలను నిర్ణయించడంలో కీలకమని ఆమె పేర్కొన్నారు. భారతీయుల కోసం రూపొందించిన ఆహార మార్గదర్శకాల్లోని సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ముఖ్యంగా రెండేళ్లలోపు పిల్లలకు అదనపు చక్కెర ఇవ్వకూడదని ఆమె స్పష్టం చేశారు.

**హెచ్ఎఫ్ఎస్ఎస్ ఆహారంతో ఆరోగ్య సమస్యలు**

పోషకాహార లోపం ఒకవైపు, ఆధునిక జీవనశైలితో మరోవైపు ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని డాక్టర్ భారతి కులకర్ణి ఆందోళన వ్యక్తం చేశారు. కొవ్వు, చక్కెర, ఉప్పు అధికంగా ఉండే హెచ్ఎఫ్ఎస్-ఎస్ ఆహారాలను అధికంగా తీసుకోవడం వల్ల ముఖ్యంగా పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఆహార భద్రత, పోషకాహార భద్రత రెండూ వేర్వేరు అంశాలని ఆమె వివరించారు. కేవలం ఆహారం అందుబాటులో ఉండటం వల్లనే పోషకాహార శ్రేయస్సు సాధ్యం కాదని, ఆహారంలో వైవిధ్యం, సరైన ఆహారపు అలవాట్లు, ప్రవర్తనా మార్పు ప్రజారోగ్యానికి కీలకమని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లో విస్తృతంగా వినియోగించే మండువా, ఝంగోరా, చోళై, కోడా వంటి దేశీయ పంటలు, చిరుధాన్యాల పోషక విలువలను అంచనా వేసేందుకు పరిశోధనలు కొనసాగుతున్నాయని తెలిపారు. రక్తహీనత తగ్గింపులో రాగి వినియోగం ప్రభావాన్ని అంచనా వేసే వైద్యపరమైన, విశ్లేషణాత్మక అధ్యయనాలు కూడా పురోగతిలో ఉన్నాయని చెప్పారు.

**పోషకాహారంపై బాధ్యతాయుత రిపోర్టింగ్ అవసరం**

ఐసీఎంఆర్--ఎన్ఐఎన్‌లోని పోషకాహార సమాచారం, కమ్యూనికేషన్--ఆరోగ్య విద్య (ఎన్ఐసీహెచ్ఈ) విభాగం అధిపతి, శాస్త్రవేత్త--జి డాక్టర్ సుబ్బారావు ఎం. గవరవరపు నిర్వహించిన సాంకేతిక సమావేశాల్లోనూ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. పోషకాహార లోపాలు, సూక్ష్మపోషకాల లోపాలు, జీవనశైలి ఆధారిత జీవక్రియ రుగ్మతల మధ్య సంబంధాన్ని ఆయన వివరించారు. శాస్త్రీయ పోషకాహార సమాచారాన్ని ప్రజలకు సులభంగా చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. తాత్కాలిక ఆహార పోకడలకు బదులుగా శాస్త్రీయ ఆధారాలతో కూడిన ఆహార పద్ధతులను ప్రోత్సహించేలా బాధ్యతాయుతమైన రిపోర్టింగ్ చేయాలని సూచించారు. అనంతరం మీడియా ప్రతినిధులు ఐసీఎంఆర్--ఎన్ఐఎన్‌లోని అధునాతన ప్రయోగశాలలను సందర్శించి ఆహార విశ్లేషణ, లిపిడ్ కెమిస్ట్రీ తదితర రంగాల్లో జరుగుతున్న పరిశోధనలను పరిశీలించారు. పరిశోధకులతో సంభాషించారు. పర్యటనలో భాగంగా సాలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించిన ప్రతినిధి బృందానికి హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక వారసత్వంపై అవగాహన కల్పించారు.

# జూటా పాలనకు కేరాఫ్ రేవంత్ సర్కారు

- 420 హామీల అమలుకు బీఆర్ఎస్ పోరుబాట.. తొలి రోజు బాకీ కార్డుల పంపిణీ
- 22ఏ భూముల సమస్యపై అసెంబ్లీని కదిలిస్తాం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్‌చెరు, సెప్టెంబర్02 (నేటి దర్శిని):**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ దగా పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన ఏడు రోజుల పోరుబాటలో భాగంగా బుధవారం పటాన్‌చెరులో నిరసన ర్యాలీ నిర్వహించారు.
ఎంజీ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఫ్లెక్సీల ప్రదర్శన, ర్యాలీ చేపట్టి ప్రజలకు బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు హామీల అమలుపై మొహం చాటేస్తోందని ఆరోపించారు.

**22ఏ భూముల సమస్యపై అసెంబ్లీని కదిలిస్తాం**

22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల సమస్యపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని జీఎంఆర్ తెలిపారు. బాధితుల సమస్యను అసెంబ్లీలో ప్రధానంగా లేవనెత్తి, పరిష్కారం లభించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డు, డివిజన్‌లో పోరుబాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కో-ఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 'ఆరు గ్యారెంటీలు'

# పచ్చి మోసం

- దేవుడి సాక్షిగా ఒట్టేసి ప్రజలను వంచించిన కాంగ్రెస్.
- వచ్చే నెల అన్నారు.. 100 రోజులన్నారు.. 1000 రోజులు కావస్తున్నా అమలు శూన్యం
- ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిన బాకీలను వెంటనే చెల్లించాలి
- రైతులు, మహిళలు, యువతను నట్టేట ముంచిన రేవంత్ రెడ్డి సర్కార్
- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.





**దేవరకొండ,సెప్టెంబర్ 2.(నేటి దర్శిని) :**
కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 'ఆరు గ్యారెంటీలు', 420 హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను తీవ్రంగా వంచించిందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.బుధవారం దేవరకొండ బస్టాండ్ వద్ద పెద్ద ఎత్తున ర్యాలీ చేసి మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ముఖ్య నాయకులు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, నేనావత్ కిషన్ నాయక్,వడ్త్యా రమేష్ నాయక్, రాష్ట్ర నాయకులు కంకణాల వెంకటరెడ్డి, ముత్యాల సర్వయ్య తదితరులు పాల్గొని కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను తమదైన శైలిలో ఎండగట్టారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా దేవరకొండ పట్టణ కేంద్రంలో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా రమావత్ రవీంద్ర కుమార్....మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, సంక్షేమ పథకాల పరిస్థితిపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ అభ్యర్థులు దేవాలయాల్లో దేవుళ్ల సాక్షిగా ఒట్లు వేసి 'గ్యారెంటీ కార్డులు' పంపిణీ చేశారని ఆయన గుర్తుచేశారు. 2023 డిసెంబర్ 9న అధికారంలోకి వచ్చిన మొదటి రోజే సంతకం చేసి, 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేస్తామని ప్రజలను నమ్మించారని తెలిపారు. అయితే 100 రోజుల గడువు దాటి దాదాపు 1000 రోజులు కావస్తున్నా హామీల అమలు మాత్రం శూన్యంగా ఉందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీల కారణంగా వివిధ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలను రమావత్ రవీంద్ర కుమార్ వివరించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఈ లెక్కన ఒక్కో మహిళకు రూ.82,500 బకాయి ఉందన్నారు.పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, దేవరకొండ నియోజకవర్గంలో చెక్కులు పొందిన సుమారు 5,000 మంది ఆడబిడ్డలకు తులం బంగారం బకాయి ఉందన్నారు.అర్హులైన విద్యార్థినులకు ఉచిత స్కూటర్ల పంపిణీ హామీని గాలికొదిలేశారని విమర్శించారు. ఎకరానికి రూ.15,000 రైతు భరోసా ఇస్తామని చెప్పి, పాత పథకం కింద ఇచ్చే మొత్తాన్ని కూడా సక్రమంగా ఇవ్వలేదని ఆరోపించారు. నాలుగు ఎకరాల రైతుకు రైతు భరోసా రూపంలోనే దాదాపు రూ.1,02,000 బకాయి ఉందన్నారు.వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులకు ఇస్తున్న రూ.2,000 పింఛన్‌ను రూ.4,000కు పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, పెంచాల్సిన రూ.2,000 చొప్పున ఒక్కో లబ్ధిదారునికి రూ.66,000 బకాయి పడిందన్నారు. రూ.6,000 పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఒక్కో దివ్యాంగుడికి రూ.66,000 బకాయి ఉందన్నారు.రూ.2 లక్షల పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను మోసం చేశారని ఆరోపించారు. వడ్ల కొనుగోలుపై క్వింటాలుకు రూ.500 బోనస్ అన్ని రకాల ధాన్యానికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు నిబంధనల పేరుతో రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు.ఎకరానికి రూ.12,500 చొప్పున గత ఆరు పంటలకు కలిపి రైతుకు రూ.75,000 వరకు బోనస్ బకాయి ఉందన్నారు.ఏడాదికి రూ.12,000 ఇస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో రెండేళ్లకు రూ.24,000 చొప్పున బకాయి ఉందన్నారు.ఏడాదికి రూ.12,000 చొప్పున రెండేళ్లకు రూ.24,000 ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. రూ.5 లక్షల విద్యా భరోసా కార్డుల హామీ అమలు కాలేదని, గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.12,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని, ఈ లెక్కన ఒక్కో నిరుద్యోగికి రూ.1,32,000 బకాయి పడిందన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు.రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని రమావత్ రవీంద్ర కుమార్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయడంతో పాటు ప్రజలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, యువత, రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజినెస్

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. నష్టాల్లో సూచీలు

**వరుసగా మూడో రోజు నష్టాలు.. 374 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్**

**ముంబై:**
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, చమురు ధరల పెరుగుదల, అమెరికా వడ్డీ రేట్లపై నెలకొన్న ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించడంతో సూచీలు వరుసగా మూడో రోజు నష్టాలను నమోదు చేశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 373.93 పాయింట్లు కోల్పోయి 76,570.35 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 141.35 పాయింట్లు పతనమై 23,914.45 వద్ద ముగిసింది. ముఖ్యంగా ఐటీ, రియాల్టీ, ఆటో రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరగడం మార్కెట్లను ఆందోళనకు గురిచేసింది. చమురు ధరలు పెరిగితే భారత్‌లో దిగుమతి వ్యయం, ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో మదుపరులు జాగ్రత్తగా వ్యవహరించారు. అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి కూడా మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఇదిలా ఉండగా, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.94.97గా నమోదైంది. అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం తదితర అంశాలు రానున్న రోజుల్లో మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.



# ఈవీలకు పెరుగుతున్న ఆదరణ..

**-ఆరు నెలల్లో మూడు రెట్లు బుకింగ్స్**



**హైదరాబాద్**
ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)కు దేశవ్యాప్తంగా ఆదరణ క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా టాటా మోటార్స్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహనాల బుకింగ్స్‌లో గణనీయమైన వృద్ధి నమోదైంది. గత ఆరు నెలల్లో ఈవీ బుకింగ్స్ మూడు రెట్లు పెరిగినట్లు టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వాహనాలను అందించడమే కంపెనీకి ప్రధాన సవాలుగా మారింది. ఉత్పత్తి సామర్థ్యం పరిమితంగా ఉండటంతో బుకింగ్స్‌కు తగిన స్థాయిలో సరఫరా చేయలేకపోతున్నట్లు కంపెనీ వెల్లడించింది. మరోవైపు రానున్న పండుగ సీజన్‌లో ఈవీలకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని టాటా మోటార్స్ అంచనా వేస్తోంది. ఈ సీజన్ అమ్మకాలు కంపెనీ చరిత్రలోనే అత్యుత్తమ త్రైమాసిక ఫలితాలను నమోదు చేసే అవకాశముందని భావిస్తోంది. జీఎస్టీ సంస్కరణలు, పశ్చిమాసియా సంక్షోభం, పెరుగుతున్న ఇంధన ధరలు వంటి పరిణామాలు కూడా వినియోగదారులను ఎలక్ట్రిక్ వాహనాల వైపు మళ్లిస్తున్నాయని కంపెనీ పేర్కొంది. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటం, ఇంధన ధరల భారం తగ్గించుకోవాలనే ఉద్దేశం కూడా ఈవీలకు డిమాండ్ పెరగడానికి కారణమవుతున్నట్లు తెలిపింది.

# భారీగా తగ్గిన బంగారం ధరలు..

**-మూడు రోజుల్లో రూ.6,220 పతనం**



హైదరాబాద్
హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు బుధవారం భారీగా తగ్గాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,070 తగ్గి రూ.1,52,020కు చేరింది. దీంతో గత మూడు రోజుల్లో 24 క్యారెట్ల పసిడి ధర ఏకంగా రూ.6,220 మేర పతనమైంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,900 తగ్గి రూ.1,39,350గా నమోదైంది. వరుసగా ధరలు తగ్గుతుండటంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఊరట లభిస్తోంది. అయితే నగరాన్ని బట్టి బంగారం ధరల్లో స్వల్ప మార్పులు ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న ధరలకు అదనంగా 3 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఆభరణాల కొనుగోలుపై తయారీ చార్జీలు, ఇతర పన్నులు అదనంగా వర్తిస్తాయి.

# బుమ్రా ఈజ్ బ్యాక్.. 8 మంది ఔట్..

**అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు ప్రకటన**
**జట్టులోకి వచ్చేసిన స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా**
**చోటు నిలబెట్టుకున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ**



అఫ్గానిస్థాన్‌తో ఈనెలలో ఢిల్లీ వేదికగా జరగనున్న 3 టీ20ల సిరీస్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి బీసీసీఐ.. భారత జట్టును ప్రకటించింది. ఈ సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. మార్చిలో న్యూజిలాండ్‌తో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్ తర్వాత విశ్రాంతి తీసుకున్న స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మళ్లీ టీ20 జట్టులోకి పునరాగమనం చేయడం విశేషం. వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, ఇషాన్ కిషన్‌లు స్థానం సంపాదించుకున్నారు. ఇటీవల ముగిసిన జింబాబ్వే పర్యటనలో ఆడిన జట్టుతో పోలిస్తే సెలెక్టర్లు ఏకంగా ఎనిమిది మార్పులు చేశారు. జింబాబ్వేలో ఆడిన రింకూ సింగ్, సూర్యాంశ్ షెగ్డే, హర్ష్ దూబే, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రిన్స్ యాదవ్, యష్ ఠాకూర్, మయాంక్ యాదవ్, అశోక్ శర్మలకు ఈసారి జట్టులో చోటు దక్కలేదు. అనుభవజ్ఞులైన సీనియర్లకు ప్రాధాన్యమిస్తూ సెలెక్టర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. జట్టులో ప్రధాన పేసర్లుగా బుమ్రాతో పాటు అర్ష్‌దీప్ సింగ్ ఉన్నాడు. వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్‌లు ప్రధాన స్పిన్నర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అయితే పేసర్ హర్షిత్ రాణాతో పాటు ఆల్‌రౌండర్లు నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌ల ఎంపిక వారి ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుంది. వీరు జాతీయ క్రికెట్ అకాడమీలో ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసిన తర్వాతే మ్యాచ్ ఆడాతారా లేదా అన్నది తెలుస్తుంది. ఈ మూడు టీ20ల సిరీస్‌కు న్యూఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానం ఆతిథ్యం ఇవ్వనుంది. సెప్టెంబర్ 13న తొలి మ్యాచ్, సెప్టెంబర్ 15న రెండో మ్యాచ్, సెప్టెంబర్ 17న మూడో టి20 జరగనున్నాయి. స్వదేశంలో జరుగుతున్న ఈ సిరీస్ ద్వారా వచ్చే ముఖ్యమైన టోర్నీలకు బలమైన తుది జట్టును సిద్ధం చేయాలని టీమిండియా యాజమాన్యం యోచిస్తోంది.

**అఫ్గానిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు:**
శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిలి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లి, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రాలి, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణాలి

# పాక్‌ను ట్రోల్ చేసిన పీటర్సన్!

**పీసీబీ నిర్ణయంపై కెవిన్ పీటర్సన్ ట్రోల్స్**
**టాస్ వేయడానికి రోజంతా పడుతుందని వ్యాఖ్య**
**ఏడుగురి వివరాలు చెబుతారేమోనని వ్యగ్యాంస్త్రాలు**



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో వరుసగా 2 మ్యాచ్‌లు ఓడిపోయిన పాకిస్థాన్ జట్టు తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. మూడో టెస్టుకు ముందే మహమ్మద్ రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘాలతో సహా ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపివేస్తూ పీసీబీ తీసుకున్న నిర్ణయం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సీనియర్లను ఇంటికి పంపి వారి స్థానంలో ఐదుగురు అరంగేట్రం చేయని కొత్త ఆటగాళ్లను ఎంపిక చేయడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు, మాజీ క్రికెటర్లు పెద్ద ఎత్తున వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. ఈ పరిణామాలపై ఇంగ్లాండ్ మాజీ సారథి కెవిన్ పీటర్సన్ తనదైన శైలిలో స్పందించాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ అజామ్‌పై హాస్యభరితమైన కామెంట్లు చేశారు. "ప్రతి మ్యాచ్‌కి ముందు జరిగే విలేకరుల సమావేశంలో జట్లలో జరిగిన మార్పుల గురించి వ్యాఖ్యాతలు కెప్టెన్లను అడుగుతారు. ఇప్పుడు నా ఫ్రెండ్ బాబర్‌కు అది చాలా సుదీర్ఘమైన సమావేశం కానుంది. ఈ లెక్కన టాస్ వేసే ఘట్టం మ్యాచ్‌కి ఒక రోజు ముందే ప్రారంభించాలేమో" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఎద్దేవా చేశారు. మరోవైపు పాకిస్థాన్ మాజీ కెప్టెన్, వ్యాఖ్యాత రమీజ్ రాజా కూడా తన సొంత క్రికెట్ బోర్డుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. "క్రికెట్ చరిత్రలో సిరీస్ మధ్యలో ఒక జట్టు ఇలా ఏడుగురు ఆటగాళ్లను, కోచ్‌లను మార్చడం నేను ఎప్పుడూ చూడలేదు. పాకిస్థాన్ నిజంగా ఒక కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇది ఫుట్‌బాల్ మ్యాచ్‌లా ఉంది.. సీజన్ మధ్యలోనే మేనేజర్‌ను తీసేసినట్లు చేస్తున్నారు. మరో పది రోజులు ఆగి సిరీస్ ముగిసాక ఈ నిర్ణయం తీసుకుంటే బాగుండేది" అని రమీజ్ రజా పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌తో మూడో టెస్టుకు ముందు పాక్ జట్టులో మహమ్మద్ ఇమ్రాన్ జూనియర్, సాద్ బైగ్, రాజావుల్లా, అరాఫత్ మిన్హాస్, ఇమ్రాన్ రంధావా వంటి ఐదుగురు అన్ క్యాప్డ్ ఆటగాళ్లను ఎంపిక చేశారు. వీరికి తోడు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను తొలగించి వారి స్థానంలో మైక్ హెస్సన్, యాప్లే నాఫ్కేలను నియమించారు. ఎన్నో వివాదాలు, ట్రోల్స్ మధ్య సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఆఖరి టెస్టులో బాబర్ సేన ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి.

## స్పోర్ట్స్

# తుది పోరుకు తిలక్ సేన

**సెమీస్‌లో నార్త్‌పై సౌత్ జోన్ విక్టరీ.. వర్మ కెప్టెన్ ఇన్నింగ్స్**



**బెంగళూరు:**
ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో హైదరాబాదీ తిలక్ వర్మ కెప్టెన్సీలోని సౌత్ జోన్ ఫైనల్ చేరింది. బుధవారం ముగిసిన రెండో సెమీస్‌లో 7 వికెట్ల తేడాతో నార్త్‌జోన్‌ను ఓడించింది. ప్రత్యర్థి నిర్దేశించిన 182 పరుగుల లక్ష్య ఛేదనను ఆ జట్టు 43.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో చెలరేగిన కెప్టెన్ తిలక్ (79 బంతుల్లో 8 ఫోర్లతో 51 నాటౌట్) అర్ధశతకానికి తోడు జగదీశన్ (43), రిక్కీ భుయ్ (42), స్మరణ్ (32 నాటౌట్) రాణించారు. ఆఫ్‌సైడ్‌లో చూడచక్కని షాట్లు ఆడిన తిలక్ స్పిన్నర్ల బౌలింగ్‌లో రివర్స్ స్వీప్, ప్యాడిల్ స్వీప్ షాట్లతో అలరించాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు చేరడం సౌత్‌జోన్‌కు ఇది 24వ సారి కావడం గమనార్హం. ఈనెల 6 నుంచి చెన్నై వేదికగా జరిగే ఫైనల్‌లో సౌత్ జోన్.. ఈస్ట్‌జోన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.


టెస్టులే ఇష్టం: తిలక్
భారత టీ20 వైస్ కెప్టెన్‌గా ఉన్న తిలక్ వర్మ.. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లలోనే జాతీయ జట్టుకు ఆడుతున్నా తనకు టెస్టులంటేనే మక్కువ ఎక్కువని అన్నాడు. దులీప్ ట్రోఫీ సెమీస్ మ్యాచ్ ముగిశాక అతడు మాట్లాడుతూ.. 'నేను భారత జట్టుకు పరిమిత ఓవర్లలో ఆడతానని ఎప్పుడూ ఊహించలేదు. అది దైవ నిర్ణయం. కానీ నాకు రెడ్ బాల్ క్రికెట్ ఆడటమంటేనే ఇష్టం. నా బలం ఎప్పుడూ టెస్టులే. ఐపీఎల్‌లో మెరుగైన ప్రదర్శన చేసి టీమిండియాలో టీ20 జట్టులోకి వచ్చా. కానీ అంతకంటే ముందు చాలా రోజులు నేను దేశవాళీలో రెడ్‌బాల్ క్రికెట్ ఆడా. అది నా రక్తంలోనే ఉంది. పరిమిత ఓవర్ల నుంచి టెస్టులకు మారడం నాకు చాలా తేలిక' అని చెప్పాడు. టెస్టుల్లో జాతీయ జట్టుకు ఆడాలని ఉందని ఈ సందర్భంగా తిలక్ ఆశాభావం వ్యక్తం చేశాడు.



అందాల సోయగం.. శ్రద్ధాదాస్ క్యూట్ ఫోటోలు..

# జైలర్ 2' రిలీజ్‌పై క్లారిటీ..

## -ఆ డేట్‌కి ప్రపంచవ్యాప్తంగా రజినీకాంత్ మాస్ జాతర!





సూపర్‌స్టార్ రజినీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడినట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజినీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజినీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.



# రజనీ అభిమానులకు పండగ

## అక్టోబర్ 15న జైలర్-2 విడుదల




సూర్ స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'జైలర్ 2'. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా 'జైలర్' సాధించిన ఘన విజయం తర్వాత సీక్వెల్‌పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే గత కొద్ది రోజులుగా సినిమా విడుదలపై సోషల్ మీడియాలో పలు రకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 'జైలర్ 2'కు సంబంధించి ఇటీవల చిత్రబృందం నుంచి పెద్దగా ప్రమోషనల్ అప్‌డేట్స్ రావడం లేదు. దీంతో సినిమా అనుకున్న తేదీకి విడుదల కాకపోవచ్చనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగింది. రిలీజ్ డేట్ మారే అవకాశం ఉందంటూ అభిమానుల్లో కూడా కొంత గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో మేకర్స్ తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చి ఈ ప్రచారానికి చెక్ పెట్టారు. ముందుగా ప్రకటించిన తేదీ ప్రకారమే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 15న 'జైలర్ 2' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుందని చిత్రబృందం మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. దీంతో సినిమా వాయిదా పడుతుందనే వార్తలకు తెరపడిన్లట్లైంది. రిలీజ్ డేట్‌పై క్లారిటీ రావడంతో రజినీకాంత్ అభిమానుల్లో సందడి మొదలైంది. దసరా సీజన్‌కు దగ్గరగా ఈ సినిమా థియేటర్లలోకి వస్తుండటంతో బాక్సాఫీస్ వద్ద భారీ ఓపెనింగ్‌పై ట్రేడ్ వర్గాల్లోనూ అంచనా మొదలైంది. ఇప్పటికే 'జైలర్ 2' నుంచి విడుదలైన 'అలా బొలేలో' పాటకు మంచి స్పందన వచ్చింది. రజనీకాంత్ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా పాటను రూపొందించడంతో అభిమానుల్లో ఉత్సాహం పెరిగింది. ఇక రిలీజ్ డేట్‌ను అధికారికంగా మరోసారి ప్రకటించిన నేపథ్యంలో ఇకపై ప్రమోషన్లను వేగవంతం చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే మరిన్ని పాటలు, టీజర్, ట్రైలర్ వంటి అప్‌డేట్స్‌తో సినిమాపై హైప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. 'జైలర్ 2'లో రజనీకాంత్‌తో పాటు భారీ తారాగణం భాగమవుతోంది. కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, విలక్షణ నటుడు ఎస్.జే. సూర్య, బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, సీనియర్ నటి రమ్యకృష్ణ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ముఖ్యంగా ఇతర ఇండస్ట్రీలకు చెందిన ప్రముఖ స్టార్లు ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో 'జైలర్ 2'పై పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తి మరింత పెరిగింది.

# ఇన్ స్టాలో సబ్‌స్క్రిప్షన్ అందుకోసమే పెట్టాను..

## అసలు విషయం చెప్పిన విష్ణు ప్రియ..

తెలుగు చిత్రసీమలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న నటి విష్ణు ప్రియ, ఇటీవల ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్, సోషల్ మీడియా ద్వారా వచ్చే ఆదాయం , తన వ్యక్తిగత జీవితంపై ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ప్రస్తుతం ఆమె రంభ ఊర్వశి మేనక చిత్ర బృందంతో కలిసి ప్రమోషనల్ ఇంటర్వ్యూలలో పాల్గొంటున్నారు. తన గురించి సాధారణంగా ప్రచారంలో ఉన్న "షోల కన్నా, మూవీస్ కన్నా కూడా విష్ణు ప్రియ సోషల్ మీడియా ద్వారా ఎక్కువ డబ్బులు సంపాదిస్తుంది" అనే వ్యాఖ్యపై ఆమె స్పందించారు. ఇది కేవలం తన ఒక్కదానికే కాదని, సోషల్ మీడియా ద్వారానే చాలా మంది సెలబ్రిటీలు టీవీ లేదా సినిమా ద్వారా వచ్చే దానికంటే ఎక్కువ సంపాదిస్తున్నారని ఆమె కుండబద్దలు కొట్టారు. బ్రాండ్‌లు, ప్రమోషన్ల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా ఉంటుందని, టీవీలో రెండు ఎపిసోడ్‌లకు వచ్చే ఆదాయం కన్నా సోషల్ మీడియాలో ఒక్క ప్రాజెక్ట్ ద్వారా ఎక్కువ లభిస్తుందని ఆమె వివరించారు. టీవీలో పడే కష్టానికి, సోషల్ మీడియాలో లభించే పర్క్‌లకు తేడా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. చాలా మందికి టాలెంట్ ఉన్నా అవకాశాలు లభించడం లేదని, కానీ తన ఫోన్ మాత్రం ప్రతిరోజూ అవకాశాలతో మోగుతుందని, ఇది తన అదృష్టమని పేర్కొన్నారు. వ్యక్తిగత విషయాల గురించి అడగ్గా, తన జీవితంలో గతంలో జరిగిన సంఘటనలను మార్చాల్సిన అవసరం లేదని విష్ణు ప్రియ దృఢంగా చెప్పారు. "నాకు జరిగిన ప్రతిదీ, మంచి అనుభవాలు, చెడు అనుభవాలు అన్నీ కలిపి నేను ఈరోజు ఉన్న వ్యక్తిని చేశాయి. అవి నాకు మరింత జ్ఞానం, సహనం, దయను అందించాయి" అని ఆమె పేర్కొన్నారు. గత అనుభవాలను మార్చడానికి తాను ఇష్టపడనని, కానీ భవిష్యత్తులో మాత్రం సరైన మార్గదర్శకత్వం కోరుకుంటున్నానని, మంచిని ఎంచుకోవడానికి, మంచి చేయడానికీ గైడెన్స్ కావాలని ఆమె అన్నారు. ముఖ్యంగా తన తల్లి మరణం తనను తీవ్రంగా ప్రభావితం చేసిందని, ఆ ఒక్క విషయాన్ని మార్చగలగలిగితే బాగుంటుందని భావిస్తున్నానని, ఆ తర్వాత దేవుడి ఇష్టమని ఆమె తెలిపారు. తాను చిన్నతనం నుంచీ అల్ప సంతోషిని అని, మ్యాథ్స్ రాదని, ఎంతో సోమరినని, డీమోటివేటెడ్‌గా ఉండేదానని విష్ణు ప్రియ వెల్లడించారు. తన కుటుంబం తాను ఏమైనా సాధిస్తుందని అస్సలు అనుకోలేదని తెలిపారు. అయినప్పటికీ, తాను ఏదో ఒకటి సాధించానని, పరిశ్రమలో 11-12 సంవత్సరాల తర్వాత కూడా అవకాశాలు లభిస్తున్నందుకు చాలా కృతజ్ఞతతో ఉన్నానని అన్నారు. తనకు ఒక్క కంప్లైంట్ కూడా లేదని, మంచి బాయ్‌ఫ్రెండ్ తప్ప అని సరదాగా వ్యాఖ్యానించారు. జాతకాన్ని తాను చాలా సీరియస్‌గా నమ్ముతానని, తనకు బాయ్‌ఫ్రెండ్ లేదని, కనీసం భర్త కూడా లేదని నవ్వుతూ చెప్పారు. తన అభిమానులు తన కోసం పూజలు చేస్తే ఒక మంచి అబ్బాయి లభిస్తాడని కూడా ఆమె అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాను 'ఊర్వశి' పాత్రలో ఉన్నానని, చాలా ప్రశాంతంగా, శాంతియుతంగా ఉండాలనుకుంటున్నానని విష్ణు ప్రియ చెప్పుకొచ్చారు.

# ఓటిటిలోకి పళ్ల బురుసు




సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధానపాత్రల్లో నటించిన చిత్రం పళ్ళబురుసు. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది. ఇప్పుడీ సినిమా నెలరోజుల్లోపే సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలంగాణ గ్రామీణ కథగా రూపొందింది. కథేంటంటే..: తెలంగాణలోని ఓ ప్లలెటూరిలో ఉండే ఒంటరి వృద్ధుడు శంభు (సుధాకర్ రెడ్డి). పంటినొప్పితో ఆస్పత్రికి వెళ్లగా.. డాక్టర్ చికిత్స చేసి, కొన్ని మందులు రాసిస్తుంది. అలాగే పళ్ళు నొప్పి రాకుండా ఉండేందుకు వేపపుల్లతో కాకుండా టూత్ బ్రష్ వాడాలని చెబుతుంది. దీంతో ఆ పళ్ళ బురుసు (టూత్ బ్రష్) కొనిమ్మని తన కొడుకు తిరుపతి (మురళీధర్ గౌడ్)ని అడుగుతాడు. కానీ, ఆ కొడుకు వ్యక్తిగత సమస్యల్లో పడి తన తండ్రి మాటని నిర్లక్ష్యం చేస్తాడు. అది శంభుకి కోపాన్ని తెప్పిస్తుంది. సరిగ్గా అదే సమయంలో అతని కొడుకు తనని ఆహ్వానించకుండా మనవరాలి పెళ్లి జరిపించడంతో అవమాన భారంతో రగిలిపోతాడు. దీంతో పళ్ళ బురుసు కొనివ్వలేదన్న సాకుతో కొడుకుపై కేసు పెట్టేందుకు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతాడు శంభు. ఇక అక్కడి నుంచి ఆ వివాదం జిల్లా కోర్టుకు చేరుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనేది కథ.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365